28న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

ఉప్పల్: రేపు నిర్వహించాల్సిన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం 28న నిర్వహించాలని సంఘం ప్రతినిధులు నిర్ణయించినట్లు శ్రీ విరాట్‌విశ్వకర్మ మహోత్సవ సమితి అధ్యక్షులు సుంకోజు రమేష్ చారి, ప్రధాన కార్యదర్శి కొల్లోజు సువర్ణాచారి పేర్కొన్నారు. ప్రతిఏటా సెప్టెంబర్ 17న విశ్వకర్మయజ్ఞ మహోత్సవం నిర్వహించే వారమని వర్షాల కారణంగా కమిటీసభ్యుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బంధువులు గమనించి 28న నిర్వహించే యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మౌలాలి: డివిజన్ షాదుల్లానగర్, సఫీనగర్, సంతోషిమానగర్ కాలనీల్లో ముంపు సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ సోమవారం డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరుతుందన్నారు. సానుకూలంగా స్పందించిన డీసీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇంజినీరింగ్ ఈఈ లక్ష్మణ్‌ను కోరారని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఉప్పల్: అభివృద్ధి పనులపై ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆరా తీశారు. ఉప్పల్‌హిల్స్‌లో రూ. 93 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులు, రూ.7 లక్షలతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఏఈ రాజ్‌కుమార్, స్థానికులతో కలిసి పరిశీలించారు. అంతకు ముందు కాలనీలో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను కార్పొరేటర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉప్పల్‌హిల్స్ 40 ఫీట్ల రోడ్డు నుంచి హనుమాన్ దేవాలయం వరకు రూ.65 లక్షలతో త్వరలో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. దుర్గం నవీన్‌యాదవ్, గోవింద్‌కుమార్‌స్వామి, ఈగ ఆంజనేయులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరిస్తాం



మల్కాజిగిరి: బండ చెరువు దిగువ ప్రాంతాల్లో ముంపు సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం షిరిడీనగర్, ఎన్ఎండీసీ కాలనీ, ఉప్పరిగూడ, రాజానగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇప్పటికే చాలా కాలనీల్లో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం కారణంగా ముంపు సమస్య తగ్గిందన్నారు. ముంపు సమస్య పరిష్కారానికి త్వరలోనే 600 ఎంఎం డయా పైపులైన్ పనులు ప్రారంభిస్తామన్నారు. డీఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మి, వీఏ రజనీకాంత్, ఉమేష్‌సింగ్, నర్సింగరావు, శ్రీధర్‌రెడ్డి, బుచ్చిరాములు తదితరులున్నారు.

మధురానగర్ నూతన కమిటీ ఏకగ్రీవం



రామంతాపూర్ : మధురానగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్.మాలకొండారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా నరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శిగా జగదీష్‌చంద్రరావు, జాయింట్ సెక్రటరీ ఎస్.శ్రీనివాస్‌సాగర్, కోశాధికారిగా గణేష్, ఆడిటర్‌గా ఇంద్రసేనారెడ్డితో పాటు ఎగ్జిక్యూటివ్ బాడీమెంబర్‌గా ఆర్.సురేష్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, మాధవవర్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులున్నారు.

త్వరలోనే సమస్యకు పరిష్కారం

కుషాయిగూడ: సాయినగర్ వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీటితో నిండిన సాయినగర్ కాలనీని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇప్పటికే బాక్స్ డ్రెయిన్ పనుల మొదలయ్యాయని, మొదటి విడత పనులు పూర్తి కాగా.. రెండో విడత పనులు ప్రారంభం కానున్నాయన్నారు. రెండో విడత పనులు పూర్తయితే భవిష్యత్తులో వరదనీటి సమస్య ఉండదన్నారు. న్యూ వాసవీశివనగర్ కాలనీలో సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో ఇప్పటికే 150 మీటర్ల సీసీ రోడ్డు పనులు మంజూరైనట్లు తెలిపారు.

ముందస్తు చర్యలతో

తప్పిన ముప్పు!

● రూ.10.74 కోట్లతో 2020లో నాలా నిర్మాణం ● మరో ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం

రామంతాపూర్: ప్రతియేటా వర్షాకాలంలో హబ్సిగూడ ఎగువన ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరదతో రామంతాపూర్ ప్రధాన రహదారిలో ఉన్న పెద్దచెరువు పూర్తిగా నిండి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. 2020లో కురిసిన వర్షానికి వరదలో హబ్సిగూడ డివిజన్‌లోని రవీంద్రనగర్, సాయి చిత్రానగర్, లక్ష్మీనగర్, జై సంతోషినగర్‌తో పాటు రామంతాపూర్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన ఇందిరానగర్, శేఖర్‌బస్తీ, నేతాజీనగర్, ప్రగతినగర్ వరద నీటితో నిండిపోయేవి. 2020లో కురిసిన భారీ వర్షాలకు దాదాపు నెలరోజుల పాటు ఈ ప్రాంతాలన్నీ వరద నీటితో నిండిపోవడమే కాకుండా కొన్ని ఇళ్లు కూలిపోయాయి. మోటార్లతో వరద నీటిని దిగవన ఉన్న ప్రగతినగర్ నాలా ద్వారా రామంతాపూర్‌లోని చిన్న చెరువులోకి తరలించినా వరద ఉధృతి తగ్గలేదు. గత ప్రభుత్వం రూ. 10.74 కోట్లతో 2020లోనే పెద్ద చెరువులో నుంచి రామంతాపూర్‌లోని చర్చి గోడౌన్స్ అరవింద్‌నగర్, టీవీ కాలనీల ద్వారా దాదాపు 5 కిలోమీటర్ల మేర భారీ పైపులైన్లతో వ్యూహాత్మకంగా నాలా నిర్మించి మూసీ నదిపై కలిసే పెద్ద వరదనీటి నాలాకు అనుసంధానం చేశారు. ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలకు పెద్ద చెరువులో నుంచి వరదనీరు ఎస్ఎన్‌డీపీ నాలా ద్వారా మూసీనాలాలో కలవడం వల్ల కాలనీలు, బస్తీల్లో వరద వచ్చిన పరిస్థితులు లేకుండా పోయాయి.

మరో నాలా నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం

◆ ప్రతియేటా వచ్చే వర్షాకాలంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వరదనీరు దిగువన ఉన్న హబ్సిగూడలోని రవీందర్‌నగర్, జై సంతోషినగర్, సాయిచిత్రానగర్ రోడ్ల మీద నుంచి ప్రవహించి పెద్ద చెరువులో చేరుతున్నాయి. ఈ విధంగా వరదనీరు రోడ్లపై ప్రవహించకుండా నేరుగా పెద్దచెరువులోకి చేరేలా మరో ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఇటీవల హబ్సిగూడ కార్పొరేటర్ చేతన వార్డు కార్యాలయంలో ఓయూ నుంచి రామంతాపూర్ పెద్ద చెరువు వరకు నిర్మించే పనులపై జీహెచ్ఎంసీ అధికారులు, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.



2022లో రామంతాపూర్ పెద్ద చెరువు వద్ద నిర్మించిన ఎస్ఎన్‌డీపీ నాలా

పక్కా ప్రణాళికతో ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం



ఎగువన ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రతియేటా వర్షాకాలంలో దిగువనున్న హబ్సిగూడ పరిధిలోని వివిధ కాలనీలో ఉన్న రోడ్లపై నుంచి వరదనీరు ప్రవహించి పెద్ద చెరువులోకి చేరుతున్నాయి. దీంతో ప్రతియేటా వర్షాకాలం హబ్సిగూడలోని పలు కాలనీల రోడ్లపై వరదనీటి ప్రవాహం ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఓయూ నుంచి పెద్ద చెరువు వరకు ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తాం.

– కక్కిరేణి చేతన, కార్పొరేటర్ హబ్సిగూడ

వరద ముంపు తప్పింది



ప్రతియేటా వర్షాకాలంలో భారీ ఎత్తున పెద్ద చెరువులో చేరే వరదనీరు దిగువగా ఉన్న రామంతాపూర్‌లోని ఇందిరానగర్, శేఖర్‌బస్తీ, నేతాజీనగర్, ప్రగతినగర్ వరద నీటితో నిండిపోయేది. దీంతో ప్రత్యేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం తరువాత ప్రతియేటా వర్షాకాలంలో వచ్చే వరద సమస్య పూర్తిగా తగ్గిపోయింది.

– షేక్ చాంద్‌పాషా, నేతాజీనగర్

రేపు మహిళలకు స్పెషల్ హెల్త్ డ్రైవ్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: ఇంటింటా స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని, కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్వస్త్ నారి – శక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరి ఆదేశాల మేరకు సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 17న అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు స్పెషల్ హెల్త్ డ్రైవ్ ఏర్పాటుచేసి, అన్ని రకాల వైద్య పరీక్షలు, ఎన్‌సీడీ, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులపై పరీక్షలు చేసి తగిన చికిత్సతో పాటు మందులు అందజేస్తారన్నారు. యువతులకు పలు ఆరోగ్యకరమైన అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. డాక్టర్ శ్రీకాంత్, సుప్రియ, శైలజ, ఆనఘ, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

బోడుప్పల్: ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న రవికుమార్, వనిత, కమలాకర్ తెలంగాణ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ పాలనకు బదిలీ కాగా.. వారిని కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోడుప్పల్‌కు సేవలు అందించడంలో వారు ముందుండేవారన్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, ఏఈ రాకేష్, మేనేజర్ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న కమిషనర్

గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

మల్లాపూర్: గురుకుల విద్యాలయాలు సొంత భవనాల్లో ఏర్పాటు చేయాలని గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక సలహాదారులు నల్లారాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నాచారంలోని బీఎస్‌పీ కార్యాలయంలో గురుకుల పేరెంట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాధాకృష్ణ మాట్లాడుతూ.. గురుకుల విద్యావ్యవస్థకు అడ్డంకిగా మారిన జీవో 17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి కార్యాచరణను రూపొందిస్తామన్నారు. గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న నాణ్యమైన విద్య, ఆహారం విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విజయ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, గణేష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, గురుకుల పేరెంట్స్ అన్నంరాజు, హరిబాబు, నాగారం సునీత, బాబు, రాజు, ఎల్లయ్య, శ్రీనివాస్, నరేందర్, బిక్షపతి, సీతారాంనాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్లు పెంచాలి

అల్వాల్: వికలాంగులకు పెన్షన్లు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్), మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో అల్వాల్ మండల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మండల వికలాంగుల హక్కుల పోరాట సమతి అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా.. పెన్షన్ పెంచలేదని, వికలాంగులకు రూ.6000 పెంచాలని డిమాండ్ చేశారు. లక్ష్మణ్, డప్పు రాజు, సురేష్ రామచంద్ర, స్వామి, నర్సింగ్‌రావు, రమేష్, మధు, వెంకటేష్, కురుమయ్య, నాగమ్మ, పోచమ్మ, బాలమ్మ, షబానా పాల్గొన్నారు.



అల్వాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దివ్యాంగుల నిరసన

స్థానిక సమస్యలపై జోనల్ ఎస్ఈ పర్యటన

అల్వాల్: భారీ వర్షాల కారణంగా కౌకూర్‌లోని జనప్రియ ఆర్కేడియా, విల్లా ఆర్చిడ్స్, లోతట్టు ప్రాంతాలు దెబ్బతిన్నాయి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆదేశాల మేరకు సోమవారం కూకట్‌పల్లి జోనల్ ఎస్ఈ చెన్నారెడ్డి, అల్వాల్ డీఈ రఘు పలువురు అధికారులు కాలనీలో పర్యటించి పరిశీలించారు. దీనికి తగిన చర్యలు తీసుకుని రోడ్డు విస్తరణ చేస్తామని హామీ ఇచ్చారు. జనప్రియ ఆర్కేడియాలో బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అఫ్రోజ్, హరికృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నేతలు తుడిమెల్ల మల్లికార్జున్, కాలనీవాసులు కిశలయ్ మహంతి, కర్నల్ ప్రశాంత్, తివారి, రామకృష్ణ, సుబేదార్ యాదవ్, శివరాజ్, మనీష్ తదితరులున్నారు.

మర్యాదపూర్వక కలయిక

మౌలాలి: మారేడుపల్లి జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను మల్కాజిగిరికి చెందిన మాంసం విక్రయదారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. విజయ్, గౌలీకర్ దినేష్, బొలేందర్ తదితరులున్నారు.

'టీఎండబ్ల్యూఈ' జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



మల్కాజిగిరి: సీఐటీయూ అనుబంధంగా ఉన్న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్కాజిగిరికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్య పరిష్కారానికి నూతన కమిటీ పనిచేస్తుందన్నారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింహచారి

మల్కాజిగిరి: వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురి కాలనీకి చెందిన నర్సింహచారి(52)కి కల్లు తాగే అలవాటుంది. ఈ క్రమంలో 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య సువర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్కారం

గౌతంనగర్: ఇంజినీర్స్ డే సందర్భంగా నగరంలో పలువురు ఇంజినీర్లను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో గౌతంనగర్‌కు చెందిన హన్మంతరావు, నూర్ అహ్మద్‌లను సత్కరించి మెమొంటోలు అందజేశారు.



ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ల పర్యటన



వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి



వరద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిత

అల్వాల్: భారీ వర్షాల కారణంగా అల్వాల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి సోమవారం ముంపు ప్రాంతాల్లో పర్యటించి వరదతో నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. వెంటనే వరదనీరు వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. డీఈ ప్రశాంతి, ఏఈ వరు, రామారావు, యాదగిరి, అరుణ్, సాజిద్, ప్రేమ్, లింగారెడ్డి, తదితరులున్నారు.

వరద సమస్యను పరిష్కరిస్తాం

హబ్సిగూడ: భారీ వర్షాల కారణంగా రోడ్డుపై వరద నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కాంగ్రెస్ నేత శ్రవణ్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్రనాయక్, సీనియర్ నేతలు జావేద్, వాసునాయక్, సాయికిరణ్, ఇర్ఫాన్, హలీం, అల్తాఫ్ ఖాదర్ తదితరులున్నారు.

అల్వాల్: భారీ వర్షాల కారణంగా వెంకటాపురంలోని శ్రీనివాసనగర్, జోషినగర్, వెస్ట్ వెంకటాపురం తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ అధికారులతో కలిసి వరదముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరదముంపు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఏఈ అరుణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ.కోటితో పార్కుల అభివృద్ధి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పార్కులను రూ.కోటితో అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం హార్టికల్చరల్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణతో కలిసి డివిజన్ పరిధిలోని పార్కుల్లో ఆయన పర్యటించారు. పార్కుల్లోకి అసాంఘిక శక్తులు రాకుండా ఉండేలా సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను అధికారి దృష్టికి తీసుకొచ్చారు. అందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ వివరించారు. బీఆర్ఎస్‌నేత బన్నాల ప్రవీణ్, జగన్, వివిధ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత, అధికారులు

ఆశావర్కర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మల్కాజిగిరి సర్కిల్ డీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రవణ్, ఆశావర్కర్లు

మల్కాజిగిరి: మున్సిపల్ విధుల్లో పాల్గొన్న ఆశావర్కర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ జీహెచ్ఎంసీ, సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఆశావర్కర్లు కష్టతరమైన విధులను నిర్వహిస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో గతేడాది జరిగిన సమగ్ర సర్వేలో పాల్గొన్న ఆశావర్కర్లకు ఇస్తామన్న రూ.10 వేలు ఇప్పటి వరకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. డివిజన్ పరిధిలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన ఉన్నప్పటికీ మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సహకరించడం లేదని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనధికార నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ఆరోపించారు.

తవ్వారు.. రోడ్డు వేయడం మరిచారు

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌లో పైపులైన్ పనులకు ఏడాదిన్నర క్రితం రోడ్డును తవ్వి, తిరిగి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు కంకర తేలి గుంతలమయమైంది. నిత్యం ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు మరమ్మత్తులు చేపట్టాలని విన్నవించారు. స్పందించకపోవడంతో సోమవారం రోడ్డు వేయాలని నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సీసీరోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఎస్వీ కిట్టు, మోహ్తాబ్, శివశంకర్‌గౌడ్, రజియా, యాదిరెడ్డి, నందుగౌడ్, కృష్ణ, రవి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



కంకర తేలిన రోడ్డును చూపుతున్న స్థానికులు

గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా రవినాయక్



మల్లాపూర్: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నాచారానికి చెందిన నేనావత్ రవినాయక్ నియామితులయ్యారు. ఈ మేరకు నాచారం డివిజన్‌కు చెందిన పలువురు నేతలు ఆయనను శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, చంద్రమౌళి, రాజిరెడ్డి, హన్మంత్, బిరాధర్, యోగేశ్వరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోపి, వేణుగోపాల్, క్రాంతికుమార్, మంజుల, వాణి, కళావతి, లావణ్య, అరుణ తదితరులున్నారు.

వ్యర్థాలను తొలగించండి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, చక్రిపురం కాలనీలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కాలనీలోని ఖాళీ ప్రదేశంలో ఇష్టానుసారంగా వ్యర్థాలు పారవేయడంతో చెత్త కుప్పలుకుప్పలుగా పేరుకుపోతోంది. నిత్యం కురుస్తున్న వర్షాలకు దుర్వాసన వెదజల్లుతోంది. పరిసరాలన్నీ అపరిశుభ్రతను తలపిస్తున్నాయి. క్రిమికీటకాల వ్యాప్తితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన భరించలేక ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఉందని, చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పనుల్లో జాప్యం.. ప్రయాణికులకు సంకటం !



వర్షానికి ముందు నాలా పనులు (ఫైల్)



వర్షం తర్వాత కుంగిన రోడ్డు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఎస్ఎన్‌డీపీ నిధులతో నిర్మిస్తున్న వరదకాలువ పైపులైన్ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు ఎదురౌతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది నెలల ముందు పీర్జాదీగూడ నుంచి పర్వతాపూర్ 4 లైన్ల రోడ్డు వేసి, రోడ్డుకు మధ్యలో పనులను సైతం పూర్తి చేశారు. రోడ్డుపూర్తి కావొస్తున్న ఎస్ఎన్‌డీపీ పనులు ఆలస్యమవుతున్నాయి. రోడ్డు మధ్యలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి వేసిన రోడ్డును తవ్వి పనులను కొనసాగిస్తూ.. ప్రజాధనం వృథాచేస్తున్నారనే విమర్శలున్నాయి. రాత్రి కురిసిన వర్షానికి వరద నీరు ప్రవహించి నాలా పనుల వద్ద ఇరువైపుల రోడ్డు కుంగి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. వేసవికాలంలో పనులు చేపట్టి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా పనులను చేయాల్సిన అధికారులు, గుత్తేదారి తమ ఇష్టానుసారంగా పనులను చేపట్టి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.